ఆంధ్రజ్యోతి

సిద్దిపేట 3

సోమవారం 12 ఆగస్టు 2024



సిద్దిపేట పాతబస్టాండ్ వద్ద వాహనదారులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు



దౌల్తాబాద్ మండలంలోని లింగరాజుపల్లిలో శిథిలావస్థకు చేరిన ఎంజేపీ బాలుర పాఠశాల

అవస్థల్లో హాస్టళ్లు

ప్రభుత్వాలు మారుతున్నా.. విద్యార్థులు చదువుకునే రెసిడెన్షియల్ పాఠశాలల్లో మార్పు రావడం లేదు. నిరుపేద విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా ఏర్పాటు చేసిన రెసిడెన్షియల్ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కరువవ్వడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇరుకు గదులు, డోర్లు లేని బాత్‌రూంలు, అపరిశుభ్ర పరిసరాలు, నాణ్యత లేని ఆహారం ఇలా...అనేక సమస్యలతో విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించలేకపోతున్నారు.

- అద్దె భవనాల్లోనే నిర్వహణ
- ప్రహరీలు లేక రాత్రిళ్లు పాములు, జంతువుల సంచారం
- మెష్ డోర్లు లేక దోమల విజృంభణ
- పలు హాస్టళ్లలోనే తరగతులు
- ఇరుకు గదుల్లోనే డార్మెంటరీలు
- జిల్లావ్యాప్తంగా 35 రెసిడెన్షియల్ పాఠశాలలు
- 8 వేల మందికి పైగా విద్యార్థులు
- మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులకు తిప్పలు



చేర్యాలలో గదులను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

సిద్దిపేట టౌన్, ఆగస్టు 11: సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, ట్రైబల్, మైనారిటీ విద్యార్థుల కోసం 35 రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేశారు. వీటిల్లో దాదాపు 8 వేలకు పైగా విద్యార్థులున్నారు. కొన్నింటికి మాత్రమే సొంత భవనాలుండగా, చాలా మేరకు అద్దె భవనాల్లోనే హాస్టళ్లు కొనసాగుతున్నాయి. తలుపులులేని బాత్‌రూంలు, డార్మెంటరీ గదులు ఇరుగా ఉండడంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. సంక్షేమ హస్టళ్లు కాస్త అవస్థల హస్టళ్లుగా మారిపోతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు.

ఇరుకుగదులే దిక్కు

దాదాపుగా అద్దె భవనాల్లోనే రెసిడెన్షియల్ పాఠశాలలు కొనసాగుతుండడంతో పలు సమస్యలు తిష్టవేశాయి. దుబ్బాకలో క్రీడా స్టేడియంలోనే జ్యోతిరావుపూలే గురుకులాన్ని నిర్వహిస్తున్నారు. క్రీడా ప్రాంగణంలోని ఓ షట్టర్‌ను స్టోర్ రూంగా వాడుతున్నారు. ఆ గదిలోని బండలు పగలడంతో బియ్యం, సామగ్రి చెడిపోతున్నాయి. విద్యార్థులకు కనీసం డైనింగ్ హాల్ కూడా ఏర్పాటుచేయలేదు. కొండపాక మండలం దుద్దెడలో అద్దె భవనంలో బాలుర సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల కొనసాగుతున్నది. పడుకునే గదిలోనే పాఠశాల తరగతులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ డైనింగ్ హాల్ ఇరుకుగా ఉండటం వల్ల కొద్ది మంది ఒకసారి, మరికొద్ది మంది మరొకసారి భోజనం చేస్తున్నారు. చేర్యాలలోని గురుకుల పాఠశాల, కళాశాలలో మరుగుదొడ్లు, మూత్రశాలలకు ఇనుప డోర్లు పాడైపోవడంతో మరమ్మతులు చేపట్టడంతో జాప్యం జరుగుతున్నది. విద్యార్థులే ఆయాలుగా మారి డార్మెంటరీ గదులను శుభ్రం చేసుకుంటున్నారు. డైనింగ్ హాల్ లేకపోవడంతో చెట్లనీడ కింద విద్యార్థులు భోజనాలు చేస్తున్నారు.



సిద్దిపేటలోని మైనారిటీ పాఠశాలలో ధ్వంసమైన కిటికీ అద్దాలకు చాపను అడ్డుపెట్టిన విద్యార్థులు



ఎన్సాన్‌పల్లిలో భోజనం వడ్డించుకుంటున్న విద్యార్థినులు



దుబ్బాకలో చెట్ల కింద కూర్చుని భోజనం చేస్తున్న విద్యార్థులు

జిల్లాలోని పలు రెసిడెన్షియల్ పాఠశాలలు అద్దె భవనంలో ఉండటంతో వాటికి ప్రహరీ, గేటు లేక రాత్రుళ్లు అడవి జంతువులు సంచరిస్తున్నాయి. దీంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. కొన్ని పాఠశాలలో ప్రధానంగా కిటికీలు ధ్వంసం కావడం, కిటికీలున్న చోట దోమతెరలు లేకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. మరుగుదొడ్లకు తలుపులు(డోర్లు) లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సిద్దిపేటలో బాలుర మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాలలో ప్రతిరోజూ మెనూ ప్రకారం ఆహారం అందించడంలేదని విద్యార్థులు తెలిపారు. కొన్నిసార్లు నాణ్యతగా ఉండడం లేదని, కొన్నిసార్లు విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని తల్లిదండ్రులు చెబుతున్నారు. వర్గల్ మండలం చౌదర్‌పల్లిలోని బాలికల సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఆవరణలో విద్యుత్ లైట్లు లేకపోవడంతో, రాత్రివేళలో కళాశాల వరకు వెళ్లాలంటే విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని పలు రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు కాస్మోటిక్, దుప్పట్లు, యూనిఫామ్ ఇంతవరకు అందజేయలేదు. పలుచోట్ల విద్యార్థులే ఒకరికొకరు వడ్డించుకుంటున్నారు. మిట్టపల్లి రెసిడెన్షియల్ హాస్టల్ ఆవరణలో గడ్డి విపరీతంగా పెరిగింది. పాములు, ఇతర కీటకాలు కూడా కనిపించే పరిస్థితి లేదు. ఆవరణ మొత్తం చెత్తాచెదారంతో నిండడంతో విద్యార్థులు డెంగీ, విషజ్వరాల బారిన పడే అవకాశలున్నాయి.



మిట్టపల్లి హాస్టల్ సమీపంలో పేరుకుపోయిన చెత్తాచెదారం

సదుపాయాలు కల్పనలో విఫలం

పేద విద్యార్థుల కోసం ఏర్పాటైన రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం, అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విద్యార్థుల తల్లిదండ్రులు, పలు విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలకు పక్కా భవనాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు స్పందించి విద్యార్థులకు అందాల్సిన కాస్మోటిక్ చార్జీలు, దుప్పట్లు, యూనిఫామ్‌లు, హాస్టళ్ల ఆవరణ చుట్టూ విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని, బాత్‌రూంలకు డోర్లు బిగించాలని కోరుతున్నారు.



చేర్యాలలో డార్మెంటరీ హాల్‌ను శుభ్రం చేసుకుంటున్న విద్యార్థులు



నారాయణరావుపేటలో డార్మెంటరీ హాల్‌లో కొనసాగుతున్న తరగతులు

ట్రాఫికర్‌పై నజర్!

- రోడ్డు ప్రమాదాలకూ అడ్డుకట్ట వేసే దిశగా అడుగులు
- రూల్స్ బ్రేక్ చేస్తే భారీగా జరిమానాలు
- నిత్యం డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు
- విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



సిద్దిపేటక్రైం, ఆగస్టు 11: రోజురోజుకూ జనాభా పెరుగుదలతో పాటు ట్రాఫిక్ కూడా అంతకంతకూ పెరుగుతూనే ఉంది. ట్రాఫిక్‌ను క్లియర్ చేయడానికి పోలీసులకు తలకు మించిన భారంగా మారుతుంది. ఒక్కోసారి ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. అయితే, వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నియమాలను పాటిస్తే ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోవు. అందుకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు తెలుసుకోవాలి. ప్రమాదాల నివారణకు, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఉండేందుకు పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా ఆటోడ్రైవర్లు ఎక్కడ పడితే అక్కడ తమ వాహనాలను నిలపకుండా, కచ్చితంగా ట్రాఫిక్ నియమాలను పాటించాలని డ్రైవర్లకు సూచిస్తున్నారు. నిబంధనలు పాటించకుం టే భారీగా జరిమానాలు విధిస్తామని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రతీ చౌరస్తాలో వాహనదారులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తున్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారు నడిపే వారు, అందులో ప్రయాణించే వారు తప్పకుండా సీటు బెల్టు పెట్టుకోవాలని సూచిస్తున్నారు. వాహనాలను నడిపేవారు తప్పకుండా లైసెన్స్ కలిగి ఉండాలని లేదంటే జరిమానాలు తప్పవని హెచ్చరిస్తున్నారు. నిత్యం డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. మద్యం సేవించి వాహనం నడిపినట్లు తేలిస్తే వాహనాన్ని స్వాధీనం చేసుకుని, కేసులు నమోదు చేస్తున్నారు. కోర్టులో జరిమానా కట్టిన తర్వాతనే వాహనాలను అప్పగిస్తున్నారు. మితిమీరిన వేగంతో వెళ్లే వాహనాలకూ భారీ జరిమానాలు విధిస్తున్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయి వారి కుటుంబం రోడ్డున పడుతుందని, గతంలో జరిగిన కొన్ని రోడ్డు ప్రమాదాలను ప్రొజెక్టర్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

జిల్లాలోని ట్రాఫిక్ పోలీసులు ప్రతిరోజు ఏదైనా ఒక పాఠశాలకు, లేదంటే కళాశాలకు వెళ్లి విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని సూచిస్తున్నారు. మైనర్లు ఎట్టి పరిస్థితుల్లో కూడా వాహనాలు నడపకూడదని హెచ్చరిస్తున్నారు. రాంగ్ రూట్లో ఎట్టి పరిస్థితుల్లో వాహనం నడపవద్దని తెలియజేస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలకు సంబంధించిన సిగ్నల్స్, రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలు, సిగ్నల్స్ ఎలా ఉంటాయి. వాటిని ఎలా పాటించాలి అనే అంశంపై ప్రొజెక్టర్ సహాయంతో ట్రాఫిక్ సిగ్నల్స్ చూపిస్తూ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు



రంగనాయకసాగర్ రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

రైతాంగానికి గొప్పవరం రంగనాయకసాగర్

- రిజర్వాయర్‌లో 3 టీఎంసీల నీటిని నింపాలి
- కెనాల్స్‌లో తుంగ, పిచ్చిగడ్డి, మట్టిని తొలగించాలి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

చిన్నకోడూరు/సిద్దిపేటటౌన్ ఆగస్టు 11 : సిద్దిపేట నియోజకవర్గ రైతులకు రంగనాయకసాగర్ రిజర్వాయర్ గొప్ప వరమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులోని రంగనాయకసాగర్ రిజర్వాయర్‌ను ఆదివారం ఆయన సందర్శించి జలదృశ్యాన్ని చూసి సంతోషం వ్యక్తం చేశారు. రిజర్వాయర్‌లోకి 3 టీఎంసీల నీటిని పంపింగ్ చేయాలని, కాలువల్లోకి నీటిని విడుదల చేసి పంటల సాగుకు నీరు అందించాలని సంబంధిత అధికారులను కోరారు.

నీటి విడుదలకు ప్రణాళికలు సిద్ధం చేయాలి

రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లోని నీటిని కాలువలకు వదిలేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. ఆదివారం సిద్దిపేట ఇరిగేషన్ ఎస్ఈ బస్వరాజ్, ఈఈ గోపాలకృష్ణతో హరీశ్‌రావు ఫోన్‌లో మాట్లాడారు. ఈ మేరకు సిద్దిపేట నియోజకవర్గంలోని రంగనాయకసాగర్‌లోకి ఇటీవల మిడ్‌మానేరు ద్వారా నీటి పంపింగ్ జరిగిందని తెలిపారు. ప్రస్తుతం రంగనాయకసాగర్‌లో 2.3 టీఎంసీల నీరు ఉందని చెప్పారు. 3 టీఎంసీల పూర్తి సామర్థ్యంతో నీటిని నింపాలని ఆయన సూచించారు. కెనాల్స్‌లో మట్టి, పిచ్చిగడ్డి తుంగ పేరుకుపోయిందని వెంటనే తొలగించాలని చెప్పారు. త్వరితగతిన కాలువల్లోకి నీటిని విడుదల చేసి రైతుంగానికి పంటల సాగుకు నీరందించాలని అధికారులను కోరారు.



తండాల్లో 5

తీజ్ సందడి

- లంబాడీ గిరిజనుల సంస్కృతికి ప్రతీక
- తొమ్మిది రోజుల పాటు వేడుక



ప్రసాద, బుకింగ్ కౌంటర్ ఆవరణలో బారులు తీరిన భక్తులు

మల్లన్న ఆలయంలో భక్తుల రద్దీ

చేర్యాల, జూలై 11: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ సందర్శనార్థం ఆదివారం వేలాది మంది భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. భక్తులు మొక్కుబడి తలనీలాలు సమర్పించి ఆలయ కోనేటిలో స్నానమాచరించి మొక్కులు తీర్చుకున్నారు. బుకింగ్ కార్యాలయం వద్ద ప్రసాద, పట్నాలు, బోనాల టికెట్లు తీసుకునే భక్తులు ఎండలో బారులు తీరడంతో ఇబ్బందులు తప్పలేదు.

దేశభక్తిని పెంపొందించేందుకే 'హర్ ఘర్ తిరంగా'

- ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి
- బీజేవైఎం జాతీయ ప్రధాన కార్యదర్శి రోహిత్ చాహల్
- రింగ్‌రోడ్డు టెండర్ గోల్‌మాల్, ఎఫ్ 1 కారు రేసులో చర్యలేవీ?
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 11 : దేశభక్తి పెంపొందించేందుకే 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమానికి నిర్వహిస్తున్నట్లు బీజేవైఎం జాతీయ ప్రధాన కార్యదర్శి రోహిత్ చాహల్ తెలిపారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డిలో జాతీయ జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బీజేవైఎం జాతీయ ప్రధాన కార్యదర్శి రోహిత్ చాహల్ మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ వరకు హర్ ఘర్ తిరంగా యాత్ర పేరిట కార్యక్రమాలు ఘనంగా నిర్వహించాలని కోరారు. ప్రతీ ఇంటిపై మువ్వన్నెల జాతీయ జెండా ఎగరేయాల్సిన బాధ్యత ప్రతీ భారతీయుడిపై ఉందన్నారు. మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ జాతీయ జెండా కార్యక్రమం అంటే మన పనికాదనే నిర్లిప్త భావన ప్రజల్లో ఉండడం దురదృష్టకరమని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు గడుస్తున్నా జాతీయ జెండా ఎగురవేయాలని ఇంటికి వెళ్లి చెప్పే పరిస్థితి ఉండడం బాధాకరమన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం కొట్లాడే అవకాశం మనకు రాలేదని, అమరులైన యోధుల త్యాగాలను గుర్తుచేసుకునేందుకు కనీసం జాతీయ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఒక్కొక్కరు పది ఇళ్లపై జెండా ఎగురవేయించే బాధ్యత తీసుకోవాలని కోరారు.

అవినీతిలో ఆ రెండు పార్టీలు ఒక్కటే

కాళేశ్వరమైనా, మేడిగడ్డైనా, సుంకేశులైనా ప్రజల సొమ్మును దోచుకోవడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒకటేనని రఘునందన్‌రావు ఆరోపించారు. ఆగస్టు 2న సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలితే అసెంబ్లీలో ఎందుకు ప్రస్తావించలేదని కేటీఆర్‌ను ప్రశ్నించారు. మరోవైపు తప్పుచేసిన అయ్యా, కొడుకులను జైలుకు పంపిస్తామని అన్న సీఎం రేవంత్‌రెడ్డి ఎనిమిది నెలలుగా ఎందుకు నోరు మెదపకపోవడం లేదని ప్రశ్నించారు. ఎఫ్-1 కార్ రేసు ఈవెంట్, రింగ్ రోడ్డు టెండర్‌లో గోల్‌మాల్ జరిగినట్లు ఆరోపించిన రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు చర్యలెందుకు తీసుకోవడం లేదని నిలదీశారు. అనంతరం బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 14 వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను పార్టీలు, కుల, మతాలకతీతంగా నిర్వహించాలని సూచించారు. అంతకుముందు ఐబీ వద్ద స్వామి వివేకానంద విగ్రహానికి, జిల్లా కోర్టు వద్ద సర్దార్ వల్లభాయ్‌పటేల్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి డా.రాజుగౌడ్, రాష్ట్ర నాయకుడు జగన్, పట్టణ అధ్యక్షుడు ద్వారకా రవి, నాయకులు వాసు, నాగరాజు, పవన్ రవిశంకర్, నరేష్, రాకేశ్, సమరసింహారెడ్డి, శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.



సంగారెడ్డిలో జాతీయ జెండాలతో తిరంగా ర్యాలీలో బీజేవైఎం జాతీయ ప్రధాన కార్యదర్శి రోహిత్ చాహల్, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలి

● సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాల్‌స్వామి

సిద్దిపేట అగ్రికల్చర్, ఆగస్టు 11: ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.15 వేలు ఇవ్వాలని, వారికి నష్టం కలిగించే పరీక్షను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాములు గోపాల్‌స్వామి డిమాండ్ చేశారు. ఆశావర్కర్ల సమస్యలపై సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, గతంలో ఆశావర్కర్లు రాష్ట్రవ్యాప్తంగా 15 రోజులు నిరవధిక సమ్మె చేశారని, ఆనాటి హెల్త్ డైరెక్టర్ శ్రీనివాస రావు హామీలు నేటికీ అమలు కావడం లేదని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో ఆశా వర్కర్లకు వేతనాలు పెంచుతామని హామీనిచ్చిందని, దాన్ని కూడా అమలు చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆశావర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేకపోతే ఆందోళన, పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి భాస్కర్, శ్రామిక మహిళా కన్వీనర్ పద్మ, ఆశా వర్కర్లు, యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాల్‌స్వామి

భార్యను చంపడానికి యత్నించిన భర్తకు రిమాండ్

సిద్దిపేట క్రైం, ఆగస్టు 11: భార్యను చంపడానికి యత్నించిన భర్తను సిద్దిపేట వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ లక్ష్మీబాబు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన నీలం రాజు తన భార్య నీలం అనితపై అనుమానంతో చంపాలని నిర్ణయించుకున్నాడు. శనివారం రాత్రి గ్రానైట్ రాయితో తలపై మోదడంతో ఆమెకు తీవ్ర రక్తస్రావమైనది. చుట్టుపక్కల వారు అనితను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి మార్చారు. నీలం రాజును అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపించినట్లు సీఐ తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అనితను సిద్దిపేట ఏసీపీ మధు, వన్‌టౌన్ సీఐ లక్ష్మీబాబు పరామర్శించారు.


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

సిద్దిపేట పట్టణంలో మహిళల బైక్ ర్యాలీ

సిద్దిపేట క్రైం, ఆగస్టు 11: భారతదేశ జాతీయ సమైక్యత స్ఫూర్తిని చాటేందుకు భారతీయ మహిళా మోర్చా, మహిళా జాగరణ సమితి ఆధ్వర్యంలో సిద్దిపేటలో ఆదివారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం నుంచి పాత బస్టాండ్ అంబేడ్కర్ చౌరస్తా వరకు వారు బైక్ ర్యాలీ నిర్వహించారు. త్రివర్ణ పతాకాలను చేతబూని. వందేమాతరం, జైహింద్, భారత్ మాతాకీ జై , జాతీయ సమైఖ్యత వర్ధిల్లాలి అంటూ మహిళలు చేసిన నినాదాలు దేశభక్తిని నింపాయి. కార్యక్రమంలో లక్కిరెడ్డి విజయ శుభాకర్‌రెడ్డి, భారతీయ మహిళా మోర్చా సిద్దిపేట జిల్లా అధ్యక్షురాలు ఇర్రి ఉమా సురేషన్‌రెడ్డి, ప్రసన్న, భాగ్యలక్ష్మి, పద్మ, ఉషారాణి, మంజుల, సుమ, విజయలక్ష్మి, కళావతి పాల్గొన్నారు.


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు















భవనంపై నుంచి విద్యుత్ తీగలపై పడి కార్మికుడి దుర్మరణం

▸▸ నిర్లక్ష్యం వహించిన బిల్డర్, లేబర్ కాంట్రాక్టర్‌పై కేసు నమోదు


రాజు మృతదేహం

పటాన్‌చెరు, ఆగస్టు 11: భవనంపై స్లాబ్ వేసే క్రమంలో ప్రమాదవశాత్తు కింద ఉన్న విద్యుత్ తీగలపై పడి కార్మికుడు దుర్మరణం పాలైన సంఘటన ఆదివారం అమీన్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధిలోని వాణీనగర్‌లో చోటుచేసుకుంది. అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. వాణీనగర్‌లో బిల్డర్ అశోక్ నూతన భవనాలను నిర్మిస్తున్నాడు. ఓ భవనం స్లాబ్ వేసే క్రమంలో ఇనుప నిచ్చెన నిర్మిస్తున్నారు. అక్కడ ఎద్దుల రాజు (42) అనే కార్మికుడు పని చేస్తుండగా, ప్రమాదవశాత్తు జారి కింద ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలపై పడ్డాడు. కరెంట్‌షాక్‌కు గురై కింద ఉన్న మిల్లర్ బకెట్‌లో పడిపోయాడు. అక్కడే ఉన్న కార్మికులు బాచుపల్లిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందారని వైద్యులు తేల్చారు. వనపర్తి జిల్లా అమరచింతకు చెందిన ఎద్దులరాజు ఆయన భార్య గోవిందమ్మలు చందానగర్ రెడ్డికాలనీలో నివాసం ఉంటూ కూలీ పనిచేసుకుంటున్నారు. గోవిందమ్మ శనివారం రాత్రి అమీన్‌పూర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిర్మాణంలోని భవనం ముందు ఉన్న 11కేవీ విద్యుత్ తీగలకు ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకుండా కార్మికుడి మృతికి కారణమైన బిల్డర్ అశోక్, లేబర్ కాంట్రాక్టర్ శ్రీనివాస్‌పై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

వృద్ధురాలి హత్య కేసులో నిందితుడి అరెస్ట్

టేక్మాల్, ఆగస్టు 11: వృద్ధురాలి హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. అల్లాదుర్గం సీఐ రేణుక ఆదివారం కేసు వివరాలను వెల్లడించారు. టేక్మాల్ మండలం కాదులూరు గ్రామ శివారులో దత్తాత్రేయ ఆశ్రమంలో అదే గ్రామానికి చెందిన అంజమ్మ కొంతకాలంగా నివాసం ఏర్పరచుకొని ఉంటుంది. ఈనెల 7న రాత్రి ఆశ్రమంలోని గుడిసెలో ఉంటున్న ఆమెను అదే గ్రామానికి చెందిన శివకుమార్ హత్య చేసి పరారయ్యాడు. ఈ మేరకు అజనమ్మ అల్లుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మూడు బృందాలు ఏర్పాటు చేసి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టి జోగిపేటలో అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా, ఆమె వద్ద ఉండే పెన్షన్ డబ్బులు, బంగారం దొంగలించేందుకు ప్రయత్నించగా కేకలు వేసిందని, అరుపులు వినిపించకుండా ముక్కు, నోరు మూడయంతో ఊపిరాడక చనిపోయిందని నిందితుడు చెప్పినట్లు సీఐ వివరించారు. ఆమె చనిపోయిన తర్వాత బంగారు గుండ్లను తీసుకుని పారిపయినట్లు విచారణలో తేలిందని వివరించారు. ఆదివారం నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. హత్య కేసును చేధించడంలో భాగస్వాములైన టేక్మాల్ పోలీస్ సిబ్బందిని సీఐ అభినందించారు. కార్యక్రమంలో పెద్ద శంకరంపేట ఎస్ఐ శంకర్, టేక్మాల్ ఏఎస్ఐ దయానంద్, సిబ్బంది ఉన్నారు.

బావిలో పడి వృద్ధుడి మృతి

శివ్వంపేట, ఆగస్టు 11: పొలంలోని గచ్చు బావి చుట్టూ గడ్డిని తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు బావిలో పడి ఒకరు మృతిచెందిన సంఘటన అల్లీపూర్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన నిమ్మల యాదయ్య(68) ఆదివారం ఉదయం గ్రామ శివారులో ఉన్న అతని పొలంలో ఉన్న గచ్చు బావి చుట్టూ గడ్డి తీస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడిపోయాడు. బావిలోని నీటిలో మునిగి మృతి చెందాడు. యాదయ్య కొడుకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

తండాల్లో తీజ్ సందడి

▸▸ లంబాడీ గిరిజనుల సంస్కృతికి ప్రతీక.. ▸▸ తొమ్మిది రోజుల పాటు వేడుక..


తీజ్ సందర్భంగా లంబాడీ మహిళల నృత్యాలు (ఫైల్)

హుస్నాబాద్, ఆగస్టు 11: గిరిజన తండాల్లో తీజ్ సందడి మొదలైంది. శీతల్ ఉత్సవాలు ముగియగానే తీజ్ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తీజ్ ఉత్సవాలు గిరిజనులకు ముఖ్యమైన పండుగ. బతుకమ్మ పండుగ తరహాలో సాగే ఈ ఉత్సవాలు గిరిజనుల సంప్రదాయానికి అద్దం పడుతాయి. లంబాడీలు తమ భాష అచార వ్యవహారాలకు ప్రాధాన్యం ఇస్తారు. చదువుకున్న యువతీ యువకులు కొంత వస్త్ర ధారణ విషయంలో మార్పులు వచ్చినా తమ సంస్కృతి సంప్రదాయాలను పాటిస్తూనే ఉన్నారు. ఆడపిల్లలు తమ ఆశలు నెరవేరాలని కోరుతూ తొమ్మిది రోజులపాటు ఉత్సాహంగా జరుపుకునే పండుగ తీజ్. తమకు త్వరగా వివాహం జరగాలని, మంచి భర్త దొరకాలని, పంటలు సమృద్ధిగా పండి అందరూ సుఖసంతోషాలతో జీవించాలని కోరుతూ యువతీయువకులు తీజ్ పండుగను జరుపుకుంటారు. బతుకమ్మ పండుగ మాదిరిగా గోధుమ నారుతో తీజ్ బుట్టలను తయారు చేసి తొమ్మిది రోజులపాటు గిరిజన యువతులు ఉపవాసాలుండి ఎంతో భక్తి శ్రద్ధలతో ఈ పండుగను జరుపుకుంటారు. జిల్లాలో అత్యధికంగా వందకు పైగా గిరిజన లంబాడీ తండాలున్న హుస్నాబాద్ ప్రాంతంలో తీజ్ ఉత్సవాల సందడి నెలకొంది. నియోజకవర్గంలోని మల్లారం తండాలో ఇప్పటికే తీజ్ ఉత్సవాలు ముగిశాయి. హుస్నాబాద్ పట్టణంలో జరుపుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. గతంలో తీజ్ పండుగ గిరిజన తండాలకే పరిమితం కాగా, ఇప్పుడు పట్టణాల్లోని గిరిజన కుటుంబాలు తమ తండాలకు వెళ్లి ఈ పండుగను ఘనంగా జరుపుకొంటారు. ఎక్కడెక్కడ స్థిరపడిన వారు సైతం ఈ పండుగ రోజుల్లో తమ ఇళ్లకు వస్తారు. అయితే, అన్ని పండుగల్లాగే తీజ్ పండుగను ప్రభుత్వం అధికారికంగా గుర్తించి, నిర్వహించాలని గిరిజనులు కోరుతున్నారు.

నాచగిరి క్షేత్రంలో స్వాతి నక్షత్ర పూజలు


హోమం నిర్వహిస్తున్న దంపతులు

వర్గల్, ఆగస్టు 11: రెండో యాదాద్రిగా పేరొందిన వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో ఆదివారం స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామివారికి విశేషాభిషేకాలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ యాగశాలలో వేద పండితులు హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకలను తిలకించడానికి భక్తులు విశేషంగా హాజరై, స్వామివారిని దర్శించుకున్నారు. శ్రావణ మాసం మొదటి ఆదివారం సందర్భంగా క్షేత్రంలో సామూహిక సత్యనారయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. 24 మంది దంపతులు కుటుంబసమేతంగా సత్యదేవుడి వ్రతమాచారించారు. స్వామివారికి 15 నిజాభిషేకాలు, 7 నిత్యకల్యాణాలు జరిగినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్. అన్నపూర్ణ తెలిపారు. ఆలయ అధికారులు సుధాకర్, పాండు, నరేందర్ పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

పుల్లూరు బండలో..

సిద్దిపేట రూరల్, ఆగస్టు 11: సిద్దిపేట మండలం పుల్లూరు బండ స్వయంభూ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో నరసింహ స్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్ర ఉత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. స్వాతి నక్షత్రం సందర్భంగా ప్రతినేల ఆలయంలో సుదర్శన నరసింహ హోమం, స్వామి వారికి పంచ కలష అభిషేకం నిర్వహిస్తారు. శ్రావణమాసం ఆదివారం రోజున ఉత్సవం ఘనంగా నిర్వహించారు. దేవాలయ వంశ పారంపర్య అర్చకులు కలకుంట్ల రంగాచార్యులు, పొడిచేటి శ్రీనివాసాచార్యులు, రామకృష్ణమాచార్యులు, సాయికృష్ణ, కలకుంట్ల నచికేత్‌ల ఆధ్వర్యంలో ఉత్సవం నిర్వహించారు. అందులో భాగంగా స్వామికి పంచామృతాలతో వేద మంత్రాల మధ్య పంచ కలశ అభిషేకం నిర్వహించారు. దేవాలయం ప్రాంగణంలో సుదర్శన నారసింహ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవంలో గ్రామ మాజీ సర్పంచ్ పల్లె నరేష్ గౌడ్, దేవస్థాన మాజీ డైరెక్టర్ కోడూరి శ్రీనివాస్, గ్రామ యువకులు, సిద్దిపేట సంతోషీమాత దేవాలయ డైరెక్టర్ సత్యం గౌడ్, భక్తులు పాల్గొన్నారు.


స్వాతి నక్షత్రం సందర్భంగా హోమం నిర్వహిస్తున్న అర్చకులు


మాట్లాడుతున్న కాశపాగ ఇమ్మయ్య

క్రిమిలేయర్ వద్దనే వారు ప్రత్యామ్నాయం చూపాలి

▸▸ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యుడు కాశపాగ ఇమ్మయ్య

పుల్‌కల్, ఆగస్టు 11: ఎస్సీ వర్గీకరణకు సంబంధించి క్రిమిలేయర్ వద్దనే నాయకులు ప్రత్యామ్నాయం చూపాలని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడు కాశపాగ ఇమ్మయ్య కోరారు. చౌటకూర్ మండలం శివంపేట గ్రామంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దళితుల్లో కూడా సంపన్నవర్గాల వారు ఉన్నారని, వారు రాజకీయంగా సామాజికంగా ఆర్థికంగా ఎదిగారని తెలిపారు. దళితుల్లో ఎదిగిన వారు కింది వర్గాలను ఏ మాత్రం పట్టించుకోకుండా దేశంలో, రాష్ట్రంలో తిష్ఠ వేసుకుని కూర్చున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితులలో సామాన్యమైన నిరుపేదలు వారితో చదువులలో గానీ ఉద్యోగాలలో గానీ ఏ మాత్రం పోటీ పడే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత వర్గాలలో వేలు, లక్షల కోట్లకు పడగలెత్తిన ధనికులు క్రిమిలేయర్‌ను అడ్డుకోవడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. అనేక ప్రాంతాల్లో ఒక కుటుంబం నుంచి రాజకీయంగా ఎదిగిన దళిత నాయకులు వారు వారి కుటుంబాల పిల్లలనే రాజకీయంగా ఎదగనిస్తున్నారు తప్పా ఇతరులను రాజకీయాల్లో ప్రోత్సహించడం లేదన్నారు. ఒక కుటుంబం నుంచి ఎంపీగా, ఎమ్మెల్యేగా ఒకటి, రెండు పర్యాయాలకంటే ఎక్కువ పోటీ చేసే అవకాశం లేకుండా చట్టాన్ని రూపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో బాబు జగ్జీవన్‌రామ్ సమతా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, వేణుగోపాల్, ఫ్రెండ్స్ యూత్ వ్యవస్థాపక అధ్యక్షుడు పొట్లిగల్ల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అల్లాపూర్‌లో కొత్త పీర్ల ఊరేగింపు


తూప్రాన్‌లో కొత్త పీర్ల ఊరేగింపు

తూప్రాన్, ఆగస్టు 11 : తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్‌లో ఆదివారం కొత్త పీర్ల పండుగను ఘనంగా నిర్వహించారు. అల్లాపూర్‌కు చెందిన బక్క సాయగౌడ్‌కు కొన్నేళ్ల క్రితం ఇసుక బావిలో పీరి దొరికిందని చెబుతారు. అప్పటి నుంచి ప్రతీ ఏటా మొహర్రం ముగియగానే కొత్త పీర్లను ఏర్పాటు చేసి, గ్రామస్థులకు అనుకూలమైన రోజున పీర్ల ఊరేగింపును నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఆదివారం ఉదయం పీరిని ఊరేగింపుగా తుమ్మ చెరువు వద్దకు తీసుకెళ్లారు. సాయంత్రం కొత్త పీర్లను వీధుల్లో ఊరేగిస్తు ఇంటింటికీ తీసుకెళ్లగా ప్రజలు మొక్కులను తీర్చుకున్నారు.

బంగ్లాదేశ్ ఘటనకు నిరసనగా కొవ్వొత్తుల ప్రదర్శన

చేర్యాల, ఆగస్టు 1: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు, హిందూ ఆలయాల కూల్చివేతను నిరసిస్తూ శనివారం రాత్రి చేర్యాలలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక అభయాంజనేయస్వామి ఆలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కరువవడం విచారకరమన్నారు. ఈ విషయమై కేంద్రం చొరవ చూపి బంగ్లాదేశ్ మారణహోమంపై చర్యలు తీసుకుని హిందువులు, హిందు ఆలయాలను కాపాడాలని కోరారు. అనంతరం మృతులకు నివాళులర్పించారు.


చేర్యాలలో కొవ్వొత్తుల ప్రదర్శనతో నివాళులర్పిస్తున్న ప్రజలు

రూ.45 లక్షల విలువ చేసే గుట్కా పట్టివేత


వాహనాల తనఖీల్లో పట్టుబడ్డ గుట్కా లారీ, నిందితులు

లారీ స్వాధీనం.. ముగ్గురి అరెస్ట్

జహీరాబాద్, ఆగస్టు 11: అధికారులు ఎంత నిఘా పెట్టిన అక్రమ రవాణా ఆగడం లేదు. ముఖ్యంగా జిల్లా మీదుగా లక్షల విలువ చేసే నిషేధిత గుట్కా తరలిపోతోంది. కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా నుంచి సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మీదుగా హైదరాబాద్‌కు గుట్కా తరలిస్తున్న లారీని ఆదివారం జహీరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. లారీలో రూ.45 లక్షల విలువ చేసే నిషేధిత గుట్కా ప్యాకెట్లు ఉండగా స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను జహీరాబాద్ పట్టణ ఎస్ఐ కాశీనాథ్ మీడియాకు వివరించారు. కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా నుంచి టీఎస్07- యూఎల్6886 నంబర్ గల లారీ హైదరాబాద్ వైపు వెళ్తోంది. ఈ క్రమంలో పట్టణంలోని అల్గోల్ చౌరస్తా(డౌన్‌టౌన్) వద్ద 65వ నెంబర్ జాతీయ రహదారిపై పోలీసులు వాహన తనిఖీలు చేస్తున్నారు. అనుమానంతో లారీని తనిఖీ చేయగా, అందులో నిషేధిత గుట్కా కనిపించింది. దీంతో ఉత్తరప్రదేశ్‌కు చెందిన లారీ డ్రైవర్ అశ్రుతాలి, ఉత్తరప్రదేశ్, కర్ణాటకలకు చెందిన బాబులాల్, జయప్రకాశ్‌లను అరెస్ట్ చేశారు. వీరు వంద బ్యాగుల్లో బీదర్ నుంచి హైదరాబాద్‌కు గుట్కా తరలిస్తున్నట్లు అంగీకరించారు. లారీని, నిషేధిత గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హైవే విస్తరణ పనుల్లో వేగం

▸▸ మార్గంలోని ఆలయాలు, మసీద్‌ల సర్వే
▸▸ కమిటీలకు త్వరలోనే నోటీసులు?

కంది, ఆగస్టు 11: అరవై ఐదో నంబర్ జాతీయ రహదారిని ఎక్స్‌ప్రెస్ హైవేగా మార్చడానికి చేపట్టిన పనులు వేగంగా సాగుతున్నాయి. హైదరాబాద్‌లో మదీనాగూడ నుంచి సంగారెడ్డి జిల్లా కేంద్రమైన పోతిరెడ్డిపల్లి చౌరస్తా వరకు దాదాపు 30 కిలోమీటర్ల మేర హైవే అథారిటీ అధికారులు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించారు. నాలుగు లైన్లతో ఉన్న ఈ జాతీయ రహదారిని ఆరు లైన్లకు మార్చనున్నారు. దీనికి అనుసంధానంగా సర్వీసు రోడ్లను కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు మదీనాగూడ నుంచి పోతిరెడ్డిపల్లి చౌరస్తా వరకు రోడ్డు కిరువైపులా చెట్లను తొలగించారు. అతి త్వరలోనే ఆయా గ్రామాల్లో ఉన్న జాతీయ రహదారికి అనుకొని ఉన్న ఆక్రమణలను, షాపులను, కొన్ని హోటల్లు, దాబాలను తొలగించనున్నారు.

హైవే విస్తరణలో భాగంగా కందిలోని కొన్ని ఆలయాలు, మసీదుల వద్ద అధికారులు సర్వే చేశారు. ఆయా ఆలయాలతో పాటు మసీదు కమిటీలకు త్వరలోనే నోటీసులు అందజేయనున్నట్లు తెలిసింది. ఏళ్లుగా పూజలు అందుకుంటూ, ఉత్సవాలు, వార్షికోత్సవాలు జరుపుకుంటున్న ఆలయాలు, వందలాది మంది ముస్లింలు ప్రార్థనలు చేసుకుంటున్న మసీద్ తొలగిస్తారన్న ఆందోళన ఆయా గ్రామాల ప్రజల్లో నెలకొంది. దీంతో ఈ ఆలయాలను, మసీద్‌ను హైవే అథారిటీ అధికారులు యథావిధిగా వేరే చోట నిర్మించి ఇస్తారా... లేక రోడ్డు విస్తరణలోని కాస్త మార్పులు చేస్తారా అనే విషయం తెలియాల్సి ఉన్నది.

పిట్టలోళ్ల నడక యాతన

రోడ్డుకు నోచుకోక.. నడిచే దారి సరిగ్గా లేక ఇబ్బందులు

- పిల్లల చదువులకు ఆటంకం
- రోగమొస్తే ఆస్పత్రికి మోసుకెళ్లాల్సిందే
- దయనీయ స్థితిలో 23 కుటుంబాలు

రామాయంపేట, ఆగస్టు 11 : ఊరికి దూరంగా విసిరేసినట్లుగా ఉంటుంది ఆవాడ. 14 ఏళ్లుగా పూరి గుడిసెల్లోనే జీవనం. కనీసం నడిచేందుకు కూడా దారీ సరిగ్గాలేని స్థితి. ఇదెక్కడో మారుమూల చోట ఉందనుకుంటే పొరపాటే! మండల కేంద్రమైన రామాయంపేటకు నాలుగు కిలోమీటర్ల దూరంలో, గజ్వేల్ మెయిన్ రోడ్డుకు సమీపంలో, వెంకటాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఉన్న పిట్టలవాడ దుస్థితి ఇది. ఇక్కడ 23 కుటుంబాలకు చెందిన 60 మంది నివసిస్తున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు ఇటువైపు కన్నెత్తిచూడడం లేదు.


ప పిట్టలవారి పూరి గుడిసెలు

ఒక్కసౌకర్యమూ లేదు

పొట్ట చేత పట్టుకుని తిరిగే పిట్టలవాళ్లు మొదట్లో ఆరు కుటుంబాలు ఇక్కడ పూరిగుడిసెలు వేసుకుని స్థిరపడ్డాయి. స్థలాలు కొని గుడిసెలు వేసుకుని ఇపుడు 23 కుటుంబాల వరకు నివసిస్తున్నాయి. ఎప్పటి నుంచో రోడ్డు కావాలని కోరుతున్నా ఆ సమస్య తీర్చేవారు లేరు. వారికి కనీసం తాగునీటి సౌకర్యం కల్పించలేదు. నడక దారీ సరిగ్గా లేక ఎప్పుడో ఒకసారి వారి పిల్లలు స్కూల్‌కు వెళ్తున్నారు. ఉన్నతంగా ఎదగాల్సిన చిన్నారులు చదువులకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. 40 ఓట్లున్న తమ వద్దకు ఎన్నికల సమయంలో మాత్రమే వస్తారని వారు మండిపడుతున్నారు. ఎవరికైనా రోగమొస్తే భుజాన మోసుకెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము ఇక్కడ స్థిరపడడమే శాపమా అంటూ వాపోతున్నారు. ఊరికి కొద్ది దూరంలోనే ఉన్నా ఇంత కాలంగా ఏ ఒక్క సౌకర్యమూ దక్కటం లేదని తమ దీనస్థితిని పట్టించుకునే నాథుడే లేడా అని వేడుకుంటున్నారు. రోడ్డు నిర్మించాలని గత ఎమ్మెల్యే పద్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. ఇకనైనా తమ ప్రధాన సమస్య అయిన రోడ్డును వేయాలని కోరుతున్నారు.



ఈసారి ఓట్లే వేయం

మా ఒక్క సమస్య కూడా తీర్చని నాయకులకు ఈసారి ఓట్లే వేయం. ఇన్నాళ్లుగా ఇక్కడ ఉంటున్నా మమ్మల్ని మనుషులుగా చూడటం లేదు. ఎన్నికలకు ముందు అన్నీ చేస్తామని.. ఆ తర్వాత ఇటు వైపే రారు. సర్పంచ్ ఎన్నికల ప్రచారానికి వస్తే నిలదీస్తాం.

– అంజమ్మ, పిట్టలవాడ


చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగిన పొదల మధ్య నుంచే వెళుతున్న పిట్టలవాడ వాసులు



నేడే చూడండి
సంధ్య 35 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 2.15pm
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి 10.40am
PVR గలేరియా - పంజాగుట్ట 11.05am
ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 10.30am
ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి 4.30pm
సినిమాస్ - చందానగర్ 4.20pm
లక్ష్మీకళ సినీప్లెక్స్ - మూసాపేట్ 2.40pm
PVR ఏషియా - వరంగల్ 12.10pm | గీతా - నిజామాబాద్ 1.30pm | నిజామాబాద్ 11.30am
RAJENDRA FILMS 9848162553

ALL TIME CLASSIC MOVIE


సుదర్శన్ 35ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.30,6.00,9.30
తారకరామ 70 - కాచిగూడ 11.00,2.15,5.45,9.15
ప్రసాడ్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 12.00,5.15,7.45,10.30
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 10.00,2.00,6.00,10.00
ఫోరం మాల్ - కూకట్‌పల్లి 10.00,2.00,6.00,10.00
గలేరియా - పంజాగుట్ట 10.30,7.00,11.00
బికాస్ - హైటెక్‌సిటీ 10.30,2.30,6.30,10.30
పివిఆర్ - ఎర్రమంజిల్ 11.20,6.30,10.30
పివిఆర్ - మూసారాంబాగ్ 10.00,2.00,6.00,10.00
ప్రిస్టన్‌మాల్ - గచ్చిబౌలి 10.00,11.00,6.00,10.00
వెక్టాస్ - కావాడిగూడ 11.00,1.40,5.40,9.40
సినీమార్క్ - ఆర్.సి.పురం 10.30,4.40,7.30,10.45
సినీ ప్లానెట్ - కొంపల్లి 10.15,1.20,7.20,10.35
ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 10.20,1.35,4.40,7.30,10.45
ఏషియన్ రాధిక - కాప్రా 10.25,1.15,4.20,7.25,10.35
ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్ 10.00,1.15,4.20,7.20,10.40
శివగంగ - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.15,6.00,9.15
షో - చింతల్ 11.15,2.30,6.15,9.45
లక్ష్మీకళ - మూసాపేట్ 11.15,2.40,6.10,9.40
జె.పి.సినిమాస్ - చందానగర్ 10.25,10.05,4.20,7.30,10.40
మూవీటైమ్ - అమీర్‌పేట 10.30,12.35,4.00,7.30,10.55
ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి 9.45,5.15
స్కైమాల్ - సనత్‌నగర్ 11.00,2.30,6.00,9.30
మంజీరామాల్ - కూకట్‌పల్లి 10.00,1.35,4.00,7.25,10.50
పి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి 12.15,7.00
మంత్రామాల్ - అత్తాపూర్ 10.00,1.35,7.35,11.10
సుధా - శాలిబండ 7.10pm
డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్ 10.15,1.50,6.35,10.10
సినీటౌన్ - మియాపూర్ 11.00,2.45,6.30,10.15
విజయలక్ష్మి - ఎల్.బి.నగర్ 1.40pm
టివోలి - సికింద్రాబాద్ 11.30,3.15,7.00,10.40
మూవీమ్యాక్స్ - మౌలాలి 11.00,2.30,6.00,9.30
మల్లికార్జున 70 - కూకట్‌పల్లి 11.15,2.30,6.15,9.45
కోణార్క్ 70 - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.30,6.00,9.15
తాళ్ళూరి కాంప్లెక్స్ - ఐ.ఎస్.సదన్ 11.00,2.00,6.00,9.00
శ్రీరాములు 70 - మూసాపేట్ 11.30,2.45,6.30,9.45
రంగ 70ఎంఎం - జీడిమెట్ల 2.00,9.15
భుజంగ 70 - జీడిమెట్ల 11.00,6.00
శ్రీదేవి 70 - చిలకలగూడ 11.00,2.30,6.00,9.15
స్వప్న 70ఎంఎం - కాటేదాన్ 11.15,2.15,6.00,9.00
బ్రహ్మరమణ 70 - అంబర్‌పేట 11.00,2.15,6.00,9.15
శ్రీ సాయిరాం 70 - మల్కాజ్‌గిరి 11.15,2.30,6.15,9.45
జ్యోతి 70 ఎ/సి - ఆర్.సి.పురం 11.00,2.15,6.00,9.15
రాజ్యలక్ష్మి 70 ఎ/సి - ఉప్పల్ 11.15,2.30,6.00,9.15
వైజయంతి 70 - నాచారం 11.00,2.00,6.00,9.00
శ్రీసాయిదుర్గ - మూసారాం 11.00,2.30,6.00,9.30
సాయిరంగ 70 - మియాపూర్ 11.00,2.00,6.00,9.00
BR హైటెక్ - మాదాపూర్ 11.00,2.15,6.00,9.15
సూపర్ 70 ఎ/సి - బాలాపూర్ 11.15,2.15,6.15,9.15
ముకుంద్ 70 - మేడ్చల్ 11.00,2.15,6.00,9.15
GLOBAL CINEMAS RELEASE

పొన్నాల దినదినాభివృద్ధి చెందాలి

● ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 11: సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామం ముత్యాల పోచమ్మ దయతో దినదినాభివృద్ధి చెందాలని, అందరికీ అన్నింటా శుభం కలగాలని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆకాక్షించారు. పొన్నాలలో శ్రీముత్యాల పోచమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనలో ఆదివారం ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో అందరు కలసి ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. అన్ని కులాల భాగస్వామ్యంతో ప్రతిష్ఠాపనను అద్భుతంగా నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు హరీశ్‌రావుని సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ తాజా మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


సిద్దిపేట అర్బన్: ముత్యాల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే హరీశ్‌రావు

ఆలయానికి రూ. 2 లక్షల విరాళం

సిద్దిపేట టౌన్, ఆగస్టు 11: సిద్దిపేట పట్టణంలోని రూరల్ పోలీస్ స్టేషన్ చౌరస్తాలో ఆదివారం శ్రీ దాసాంజనేయస్వామి ఆలయ విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ మేరకు ఆలయంలో పూజలు నిర్వహించారు. ప్రతిష్ఠాపనకు రూ. 2 లక్షలు ఆలయ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు ఆశీర్వచనము చేయగా, ఆలయ నిర్వాహకులు సత్కరించారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

సిద్దిపేటరూరల్, ఆగస్టు 11: ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన సిద్దిపేట రూరల్ మండలం పెద్దలింగారెడ్డిపల్లికి చెందిన కోదాది శ్రీకృష్ణ కుటుంబాన్ని ఆదివారం ఎమ్మెల్యే హరీశ్‌రావు పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటానని, అన్ని విధాలా ఆదుకుంటామన్నారు.

గ్రామాలను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

● దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, ఆగస్టు 11: గ్రామస్వరాజ్యమే లక్ష్యమని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తీరా గ్రామాలను, స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. దుబ్బాక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం మూడువందల మంది బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా పాలనను గాడీలో పెట్టలేకపోయిందన్నారు. ఈ ఎనిమిదినెలల్లో కనీసం సపాయి కార్మికులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి గ్రామపంచాయతీలకు దాపురించిందన్నారు. గ్రామాలల్లో పారిశుధ్యం పడకేసిందన్నారు. నిధులివ్వకుండా కార్యదర్శులను స్వచ్ఛదనం, పచ్చదనం చేయాలని ఆదేశిస్తే, ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. గ్రామ పంచాయతీలకు ఇప్పటివరకు నిధులను అందించలేదన్నారు. సీజనల్ వ్యాధులతో గ్రామాలు తల్లడిల్లుతున్నాయన్నారు. ఆయనవెంట ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య, దుబ్బాక మున్సిపల్ ఛైర్‌పర్సన్ వనితారెడ్డి, నాయకులు బాల్‌కిషన్‌గౌడ్, ఇల్లెందుల శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, తదితరులున్నారు.


దుబ్బాకలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మెడికల్ షాపుకు వెళ్లిన యువతి అదృశ్యం


నవీన(ఫైల్)

వర్గల్, ఆగస్టు 11: మెడికల్ షాపుకు వెళ్తున్నానని ఇంట్లో నుంచి వెళ్లిన యువతి అదృశ్యమైంది. ఈ ఘటన వర్గల్ మండలం అవుసులోనిపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన మోతే నవీన (19)అనే యువతి శనివారం మధ్యాహ్నం మెడికల్ షాప్‌కు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి సాయంత్రం వరకు తిరిగి రాలేదు. చుట్టు పక్కల, స్నేహితుల ఇళ్లు, బంధువుల వద్ద వాకబు చేసినా ఆమె ఆచూకీ లభించలేదు. యువతి తండ్రి మోతే నర్సయ్య ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

భవనంపై నుంచి జారిపడిన వ్యక్తి

చేర్యాల, ఆగస్టు 11: చేర్యాల పట్టణంలోని శ్రీనగర్‌కాలనీలో ఓ భవనంలో అద్దెకు ఉంటున్న అర్జునపట్ల ఓ కంపనీ ఉద్యోగి. ఆదివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు భవనంపై నుంచి జారి కిందపడడంతో స్వల్ప గాయాలయ్యాయి. డిష్, నెట్ ఫైబర్ కేబుళ్లు అడ్డుపడడంతో ప్రమాదం తప్పింది.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

చిన్నకోడూరు, ఆగస్టు 11: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నకోడూరు గ్రామ శివారులో కొంతమంది పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయం సమాచారంతో ఆదివారం సాయంత్రం సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, చిన్నకోడూరు పోలీసులు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 16,800 నగదు, 5 ఫోన్‌లు, 5 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఓ వ్యక్తి పరారీలో ఉన్నాడు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'మహాలక్ష్మి పథకాన్ని అమలు చేయాలి'

కోహెడ, ఆగస్టు 11: కాంగ్రెస్ ప్రతీ మహిళకు మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ. 2500 చొప్పున ఇస్తానని చెప్పి నెలలు గడుస్తున్నా, ఇంతవరకు ఒక్క మహిళకు కూడా డబ్బులు ఇవ్వలేదని పీఏసీఎస్ ఛైర్మన్ పేర్యాల దేవేందర్‌రావు ఆరోపించారు. కోహెడలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. 'గద్దెనెక్కే వరకు ఒక మాట, ఎక్కాకా మరో మాట' అని విమర్శించారు. కేబినెట్ మీటింగ్, అసెంబ్లీ సమావేశాల్లో మహాలక్ష్మి పథకం ప్రస్తావన తీసుకురాకపోవడం కాంగ్రెస్‌కు మహిళల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని ఎద్దేవా చేశారు.

రేపు గజ్వేల్ బంద్‌కు హైందవ సంఘాల పిలుపు

గజ్వేల్, ఆగస్టు 11: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా గజ్వేల్ పట్టణంలో రేపు బంద్ నిర్వహిస్తున్నట్లు హైందవ సంఘాల నాయకులు తెలిపారు. గజ్వేల్ బంద్ పిలుపునివ్వడంతో పాటు పాదయాత్రగా హిందూ ఐక్యతా ర్యాలీని ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. అంగడిపేట హనుమాన్ ఆలయం నుంచి కోర్టు వరకు ఈ ర్యాలీని నిర్వహించనున్నామని, హిందువులంతా హాజరై జయప్రదం చేయాలన్నారు.

మద్దూరు ఎస్ఐకి సన్మానం

మద్దూరు, ఆగస్టు 11: మద్దూరు మండల ఎస్‌గా బాధ్యతలు చేపట్టిన షేక్ మహబూబ్‌ను కాంగ్రెస్ మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు గుండెగోని లలితామల్లేశం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాకప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయడంతో పాటు గంజాయి రహిత మండలంగా తీర్చిదిద్దాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు ప్రకాశం, మల్లారెడ్డి ఉన్నారు.

కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సుదర్శన్

కొండపాక, ఆగస్టు 11: కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అంకిరెడ్డిపల్లికి చెందిన సుదర్శన్‌ను నియమించారు. ఆదివారం ఆయనకు నియామక పత్రాన్ని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నర్సారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ.. పార్టీ పటిష్ఠతకు తనవంతు కృషి చేస్తానన్నారు. తనను నియమించినందుకు జిల్లా అధ్యక్షుడు నర్సారెడ్డి, కొండపాక, కుకునూరుపల్లి మండలాల అధ్యక్షులు లింగారావు, శ్రీనివాస్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశం, సురేందర్ రావు, సిద్ధు, నరేందర్ రావు, కనకరావు తదితరులున్నారు.

ఫాతిమాకు పీహెచ్‌డీ

సిద్దిపేట క్రైం, ఆగస్ట్ 11: సిద్దిపేట డిగ్రీ కళాశాల(అటానామస్)లో బోటనీ లెక్చరర్‌గా పనిచేస్తున్న మేరాజ్ ఫాతిమా బోటనీలో పీహెచ్‌డీ పూర్తి చేసి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. బోటనీలో ఆమె 'లాండోల్టియ పంక్టటాలో ఉన్న ఫైటో కెమికల్, ఫార్మాకోలాజికల్ స్క్రీనింగ్ యాంటీ కాన్సర్ యాక్టివిటీ' పై ఆమె చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ లభించినట్లు తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ సుజాత పర్యవేక్షణలో మేరాజ్ ఫాతిమా పరిశోధన పూర్తి చేశారు. పీహెచ్‌డీ పట్టా పొందిన ఆమెను కళాశాలకు చెందిన అధ్యాపకులు అభినందించారు.

ఆర్థిక సహాయం అందజేత

దూళిమిట్ట/చేర్యాల,ఆగస్టు 11: అనారోగ్యంతో మృతిచెందిన స్నేహితుడి కుటుంబానికి మిత్రులు అండగా నిలిచారు. మండలంలోని లింగాపూర్‌కు చెందిన మీస నర్సింహులు గత నెలలో అనారోగ్యంతో మృతి చెందాడు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అతడితో కలిసి (2004-05)లో పదోతరగతి చదువుకున్న స్నేహితులు రూ.55 పోగు చేశారు. ఆ డబ్బును మీస నర్సింహులు కుమార్తె నవ్యశ్రీ పేరు మీద పోస్టాఫీసులో కిసాన్ వికాస్ పత్రు ఖాతాలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆదివారం రసీదును కుటుంబసభ్యులకు అందచేశారు. కార్యక్రమంలో శవల్ల సంపత్, శవల్ల కృష్ణ, ఇరుముల అశోక్,ఇస్లావత్ చిరంజీవి, లింగాల సాగర్, వీదిగారి రమేష్, చామంతుల రమేష్, నర్మెట్ట రాజు తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల మండలం చిట్యాలకు చెందిన మ్యాక సత్తయ్య ఇటీవల మరణించడం పట్ల సంతాపం వ్యక్తంచేస్తూ కాంగ్రెస్ నాయకుడు జానకిస్వామి ఆదివారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు.

నేడు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చేర్యాల, ఆగస్టు 11: సీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రభుత్వం చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూళిమిట్ట మండలాలకు చెందిన పలువురికి మంజూరు చేసిన చెక్కులను నేడు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేతులమీదుగా స్థానికంగా ఉన్న ఓ గార్డెన్స్‌లో పంపిణీ చేయనున్నట్లు పార్టీవర్గాలు తెలిపాయి.

బెంగుళూరులో మల్లన్న ఆలయ ఒగ్గు కళాకారుల ప్రదర్శన


ఒగ్గుకథ ప్రదర్శన చేస్తున్న ఒగ్గుకథ కళాబృందం

చేర్యాల, ఆగస్టు 11: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ ఒగ్గు కళాకారులు ఆదివారం బెంగుళూరులోని ఓ యూనివర్సిటీలో ఒగ్గుకథను ప్రదర్శించారు. రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ, బెంగుళూరులోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మీడియా స్టడీస్ క్రైస్ట్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో మల్లన్న ఒగ్గుకథ కళాబృందం సభ్యులు పాల్గొన్నారు. తెలంగాణ ప్రాచీన జానపద కళారూపమైన ఒగ్గుకథ ఔన్నత్యాన్ని చాటారు.

వయనాడ్ బాధితుల కోసం సీపీఐ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ

కోహెడ, ఆగస్టు 11: కేరళ వరద బాధితుల కోసం సీపీఐ మండలశాఖ ఆధ్వర్యంలో కోహెడ మండల కేంద్రంలో ఆదివారం విరాళాలు సేకరించారు. మండల కేంద్రంలోని షాపులలో విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ముంజ గోపి, మండల సహాయ కార్యదర్శి బోనగిరి శంకర్, జిల్లా మహిళా సమైక్య కార్యదర్శి రజిని, మాజీ సర్పంచ్ తాళ్లపల్లి ఎల్లయ్య, బండారు లక్ష్మణ్, కనకయ్య, కాత శ్రీకాంత్ తదితరులున్నారు

'అమరవీరుల కుటుంబాల సన్మాన సభను జయప్రదం చేయండి'


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 11: మాదిగ అమరవీరుల కుటుంబాలకు ఈ నెల 13న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే సన్మాన సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కాశపాక రాజేందర్, జిల్లా అధ్యక్షుడు భూమిగారి రాజేందర్ కోరారు. సిద్దిపేటలోని బీజేఆర్ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎందరో అమరుల త్యాగం వల్లే వర్గీకరణ జరిగిందని, అమరవీరుల కుటుంబాలకు మాదిగ, మాదిగ ఉపకులాలు రుణపడి ఉంటాయన్నారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి రాజేందర్, కార్యదర్శి వెంకటేష్, నర్సింహులు రాజు, నాగరాజు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

'మాలలు ఉద్యమ స్ఫూర్తిని చాటాలి'

సిద్దిపేట టౌన్, ఆగస్టు11: మాలలందరూ కలిసి ఉద్యమ స్ఫూర్తిని చాటాల్సిన సమయం ఆసన్నమైందని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటసమితి సిద్దిపేట జిల్లా కన్వీనర్ మద్దెల నర్సింహులు పిలుపునిచ్చారు. సిద్దిపేట పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఆదివారం కొవొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబునాయుడు హయాంలో వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు అసెంబ్లీ ముట్టడి చేస్తుండగా తూటాల వర్షం కురిపించారన్నారు. దీంతో గోపయ్య, శేషయ్య అనే మాల జాతి బిడ్డలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, అనేకమంది ఆసుపత్రి పాలయ్యారని చెప్పారు. నాటి నుంచి నేటి వరకు మాలలపై ప్రభుత్వాలు విషం చిమ్ముతునే ఉన్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు కోదది శ్రీనివాస్, జంజీరపు ఎల్లేష్, పెర్క మధు, పోతుల మోహన్, సామల్ల గణేష్, బత్తుల మహేష్, బొమ్మల విజయకుమార్, బొమ్మల ప్రవీణ్, కుకునూరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

● గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

కుకునూరుపల్లి, ఆగస్టు 11: నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు ముందుకు సాగాలని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కుకునూరుపల్లి గ్రామశాఖ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి హాజరయ్యారు. కుకునూరుపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడిగా కొంతం కరుణాకర్‌ను నియమించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఇండ్ల కనకయ్య, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాపాలనకు అనూహ్య స్పందన

సిద్దిపేట రూరల్, ఆగస్టు11: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజాపాలనకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తున్నదని కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గం ఇన్‌చార్జి పూజల హరికృష్ణ పేర్కొన్నారు. సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్ మాజీ సర్పంచ్ ముత్యాల దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసిందన్నారు. కాంగ్రెస్ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచులు కనకయ్య, పాపయ్య, మాజీ వార్డు సభ్యులు ఎల్లం, చంద్రం, వజ్రవ్వ, రైతు సంఘం నాయకులు జగన్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారన్నారు.


సిద్దిపేట రూరల్: వెంకటాపూర్‌లో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న హరికృష్ణ

చింతమడక బాధితులకు అండగా..

చింతమడక పునర్నిర్మాణంలో భాగంగా ఇళ్లు కోల్పోయిన బాధితులకు కాంగ్రెస్ అండగా ఉంటుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ భరోసానిచ్చారు. సిద్దిపేట రూరల్ మండలం చింతమడకలో కాంగ్రెస్ గ్రామశాఖ కమిటీని ఏర్పాటు చేశారు. గ్రామంలో మాజీ సీఎం కేసీఆర్ హామీలు విఫలమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు విన్నవించమన్నారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణగౌడ్, కిషన్, వనజ, కలీంముద్దీన్, మంద పాండు, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమస్యలపై ఉద్యమిస్తాం

● ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సింగిరెడ్డి నవీన, అత్తిని శారద


నినాదాలు చేస్తున్న ఐద్వా నాయకులు

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 11: మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమిస్తామని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సింగిరెడ్డి నవీన, అత్తిని శారద పేర్కొన్నారు. సిద్దిపేటలో అర్బన్ మండల ఐద్వా ప్రథమ మహాసభ సందర్భంగా జెండా ఆవిష్కరణ అనంతరం నిర్వహించిన మహాసభలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల మూలంగా మహిళలకు అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. మహిళలు పట్టపగలే రోడ్డు మీద తిరిగే పరిస్థితి లేదన్నారు. వీటిని అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమైయ్యాయని విమర్శించారు. సమాజంలో సగభాగమైన మహిళలకు అన్నింట్లో 50 శాతం రిజర్వేషన్ ఉండాల్సింది పోయి ఈ రోజు చట్టసభల్లో 33 శాతానికే పరిమితం చేశారని, అది కూడా 2029 నుంచి అమలు చేస్తామనడం సిగ్గుమాలినయ చర్య అన్నారు. మహాసభలలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, ఐద్వా జిల్లా నాయకురాలు జాలిగపు శిరీష పాల్గొన్నారు. అనంతరం ఐద్వా మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా బెల్లి రాజమణి, కార్యదర్శిగా దండు లక్ష్మి, ఉపాధ్యక్షులుగా మద్దెల లక్ష్మి, చెప్యాల బాలమణి, రేణుక, సహాయ కార్యదర్శులుగా బైరోజు హరిత, కొంచెం సుజాత, ఖాత లక్ష్మి, మండల కమిటీ సభ్యులుగా రాజేశ్వరి, మంజుల, కవిత, స్వరూప, లక్ష్మి, ఉమామహేశ్వరి, నరసవ్వ, పద్మ, గంగవ్వ, సప్నలను ఎన్నుకున్నారు.

కోహెడలో హర్‌ఘర్ తిరంగా..


త్రివర్ణ పతాకంతో నాయకులు

కోహెడ, ఆగస్టు 11: కోహెడ మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం నేతృత్వంలో లాల్ బహదూర్‌శాస్త్రి విగ్రహాన్ని శుద్ధి చేసి పూల మాలు వేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధానకార్యదర్శులు నర్సయ్యగౌడ్, జాలిగం రమేష్, బీజేపీ జిల్లా నాయకులు గుగ్గిళ్ల శ్రీనివాస్, బండ జగన్‌యాదవ్, కొండబత్తిని సతీష్, బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడు బండ సుమన్‌యాదవ్ ఉన్నారు.

'అంబేడ్కర్ అభయహస్తం పథకాన్ని వెంటనే అమలు చేయాలి'

గజ్వేల్, ఆగస్టు 11: అంబేడ్కర్ అభయహస్తం పథకం అమలు చేయాలని డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు కోరారు. గజ్వేల్ పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం దళితులకు ఇచ్చిన హామీలు హామీలుగానే మిగిలిపోయాయన్నారు. ఎస్సీ కార్పొరేషన్ స్వయం ఉపాధి ఆర్థిక మద్దతు పథకాలకు బ్యాంకు లింకేజీ తొలగించాలని, 2020-21 ఆర్థిక సంవత్సరం పెండింగ్ రుణాలకు సంబంధించిన సబ్సీడీని విడుదల చేయాలన్నారు. క్రాప్‌లోన్ పేరుతో నెలవారీ పింఛన్లను లింక్ పెట్టవద్దని, క్రాప్‌లోన్లతో సంబంధం లేకుండా నెలవారీ పింఛన్లను అందజేయాలని డిమాండ్ చేశారు.

రజకులు రాజకీయాల్లో ఎదగాలి

● రజకసంఘం మండల అధ్యక్షుడు రాజు

ములుగు, ఆగస్టు 11: రజక కులస్థులు విద్యతో పాటు రాజకీయంగా ఎదగాలని ములుగు మండల రజక సంఘం అధ్యక్షుడు రాజు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం మండల రజక సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు సూచనల మేరకు రాబోయే కాలంలో రాజకీయంగా ఎలా ఎదగాలని దానిపై చర్చ జరిపారు. సమావేశంలో మాజీ వార్డు సభ్యులు జాలిగామ దశరథ, కృష్ణ, నర్సింహులు, సత్తయ్య, మల్లేష్, రాజు, మహేష్ వివిధ రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గౌడ సంఘం నియోజకవర్గ స్థాయి కమిటీ ఎన్నిక

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 11: హుస్నాబాద్ పట్టణంలో ఆదివారం నియోజకవర్గ స్థాయి గౌడసంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా బుర్ర పరుశురాములుగౌడ్, నియోజకవర్గ ఛైర్మన్‌గా మార్క అనిల్‌గౌడ్, వైస్‌ఛైర్మన్లుగా తాటిపాముల సత్యం, లక్ష్మణ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా పచ్చిమట్ల శ్రీకాంత్, కార్యదర్శులుగా జాగీరు రవీందర్, పైడిమల్ల తిరుపతి, తాళ్లపల్లి సదానందం, బంగోని శ్రీనివాస్ గౌడ్, గట్టు రాములు, ఆకుల వెంకట్‌గౌడ్, కన్వీనర్లుగా సుధాకర్‌గౌడ్, మారకరాజు, ముంజ శ్రీనివాస్, తిరుపతిగౌడ్, పూదరి రవి, పూదరి వరప్రసాద్, సమ్మయ్య, పచ్చిమట్ల రాధ, తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నియోజకవర్గంలోని గౌడకులస్థుల సంక్షేమం కోసం, విద్యా, వైద్యం కోసం త్వరలో కార్యచరణ ప్రారంభిస్తామని ఛైర్మన్ అనిల్‌గౌడ్ పేర్కొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం


చేర్యాల మండలం ఆకునూరు జడ్పీఎస్ఎస్ 1998-99లో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్య నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. నాటి జ్ఞాపకాలను గుర్తుకుచేసుకున్నారు. - చేర్యాల


సిద్దిపేట జిల్లా కేంద్రంలోని బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2000-01లో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. గురువులను సన్మానించారు. - సిద్దిపేట క్రైం


నంగునూరు, ఆగస్టు 11: నంగునూరు ఉన్నత పాఠశాలలో 2004-2005లో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆ నాటి గురువులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి మంద మహేందర్ పాఠశాల అభివృద్ధికి రూ.12వేల ఆర్థిక సహాయాన్ని అందించాడు. - నంగునూరు


కొమురవెల్లి మండలం గురువన్నపేట జడ్పీఎస్ఎస్‌లో 2013-14లో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించారు. - చేర్యాల

తన్జీముల్ మసాజిద్ కమిటీ ఛైర్మన్‌గా మతిన్


సయ్యద్ మతిన్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

గజ్వేల్, ఆగస్టు 11: గజ్వేల్ పట్టణంలోని తన్జీముల్ మసాజిద్ కమిటీ(టీఎంసీ) ఛైర్మన్‌గా గజ్వేల్ పట్టణానికి చెందిన సయ్యద్ మతీన్ విజయం సాధించారు. గజ్వేల్ పట్టణంలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో మొత్తం 1203 ఓట్లు పోలవగా, హైదర్ ఇక్బాల్‌కు 54ఓట్లు, సయ్యద్ మతీన్‌కు 1143ఓట్లు రాగా, ఆరు ఓట్లు చెల్లకుండా పోయాయి. ఈ క్రమంలో 1089 ఓట్ల ఆధిక్యంతో ఇక్బాల్‌పై సయ్యద్ మతీన్ విజయం సాధించినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ సందర్భంగా టీఎంసీ ఛైర్మన్‌గా సయ్యద్ మతీన్‌కు గెలుపు పత్రాన్ని ఎన్నికల అధికారులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో గెలిపించన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అజహర్, ఎంఏ.జిలానీ, ముఖ్తార్, అయూబ్, ఆమేర్, అడ్డు, తౌహిద్, రఫీఖ్, ఇంతియాజ్, నవాజ్, ఫెరోజ్‌లు మతీన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. వారి వెంట నాయకులు గాడిపల్లి భాస్కర్, సాజిద్‌ఖాన్, సర్దార్‌ఖాన్, బెజుగామ శివారెడ్డి, సందీప్‌రెడ్డి, జహీర్, సమీర్, వహీద్, ఆజాం తదితరులున్నారు.

వర్తమాన అంశాలపై పట్టు కలిగి ఉండాలి


● ఆన్‌లైన్ వీడియోలను అనుసరించి ఆగం కావొద్దు

● పోటీపరీక్షల శిక్షణ నిపుణులు, అసిస్టెంట్ ప్రొఫెసర్ హరికృష్ణ


మాట్లాడుతున్న ప్రసన్న హరికృష్ణ

గజ్వేల్, ఆగస్టు 11: వర్తమాన అంశాలపై పట్టు కలిగి ఉండాలని పోటీ పరీక్షల విద్యార్థులకు పోటీపరీక్షల శిక్షణ నిపుణుడు, అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ సూచించారు. గజ్వేల్ పట్టణంలో టీవైఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రణాళికతో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు ముందుకు సాగాలని, ముఖ్యంగా వర్తమాన అంశాలు, తెలంగాణ ఉద్యమ చరిత్రపై అవగాహన కలిగి ఉండాలన్నారు. టీవైఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ తలకొక్కుల రాజు మాట్లాడుతూ.. టీవైఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల ద్వారా పలువురు వివిధ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. టీవైఆర్ ఫౌండేషన్, విన్నర్స్ పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో రూ.లక్ష విలువ చేసే మెటీరియల్‌ను అభ్యర్థులకు అందజేశారు. ఆయనవెంట రచయిత అనంతరామకృష్ణ, సీనియర్ ఫ్యాకల్టీ మహిపాల్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, టీవైఆర్ ఫౌండేషన్ డైరెక్టర్ విజయలక్ష్మి, సామాజిక కార్యకర్త సాదక్‌పాషా తదితరులున్నారు.

గ్రంథాలయానికి పోటీ పరీక్షల పుస్తకాల పంపిణీ


పోటీ పరీక్షల పుస్తకాలను చూపుతున్న ఫౌండేషన్ సభ్యులు

సిద్దిపేట క్రైం, ఆగస్ట్ 11: సిద్దిపేట జిల్లా గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న అభ్యర్థుల కోసం కరీంనగర్‌కు చెందిన డాక్టర్ బీ.ఎస్.రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను పంపిణీ చేశారు. పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న అభ్యర్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని భారత ఆర్థిక వ్యవస్థ, ఆర్థిక అభివృద్ధి, తెలంగాణ చరిత్ర, తెలంగాణ ఉద్యమం, భారత రాజ్యాంగం, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇండియన్ హిస్టరీ, కల్చరల్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న అభ్యర్థులు డాక్టర్ బీ.ఎస్‌రావుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆధ్యాత్మికత భావాలను పెంపొందించాల్సిన బాధ్యత అర్చకులదే

● డీడీఎన్ అర్చక సంఘం అధ్యక్షుడు కోహెడ ప్రసాదరావుశర్మ

కోహెడ ఆగస్టు 11: ఆధ్యాత్మిక భావాలను పెంపొందింపజేసే బాధ్యత అర్చకులపై ఉందని డీడీఎన్ అర్చక సంఘం అధ్యక్షుడు కోహెడ ప్రసాదరావుశర్మ అన్నారు. కోహెడ మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి, శ్రీ రాజరాజేశ్వరస్వామి, హరిహర ఆలయంలో ఆదివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలోని ధూప దీప నైవేద్యం పథకం కింద పనిచేస్తున్న అర్చకులు అందరూ గ్రామీణ ప్రాంతాల్లోని తమ తమ ఆలయాల్లో అర్చకత్వవృత్తిని కొనసాగిస్తూ, గ్రామాల్లో ఆధ్యాత్మికత వైపు ప్రజల్ని తీసుకెళ్లేందుకుగా తమ వంతు కృషి చేయాలని కోరారు. ప్రతీ నెల మాస శివరాత్రి సందర్భంగా మండలంలోని ఒక ఆలయం అభిషేక కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అధ్యక్షుడిగా కోహెడ ప్రసాదరావుశర్మ, ప్రధాన కార్యదర్శిగా శ్రీరంగం రామాచార్యులు, ఉపాధ్యక్షులుగా తిరునహరి కేశవస్వామి, పెందోట విష్ణుమూర్తాచార్యులు, కోశాధికారి శ్రీరంగం నరసింహమూర్తి, సంయుక్త కార్యదర్శిగా ఆచ్చి మధుసూదనాచార్యులు, నాంపల్లి ఆంజనేయులు, ముఖ్య సలహాదారుగా గాడిచర్ల వెంకటేశ్వర్రావు, సలహాదారుగా పెద్ద ప్రభాకరాచార్యులు, కార్యవర్గ సభ్యులుగా మంతెన రవి, శ్రీరంగం సంపత్ కుమారాచార్యులు, పెమ్మరాజు సంపత్ కుమార్‌శర్మ పీచర శేషాచార్యులు ఎన్నికైయ్యారు.